


మళ్లీ ఐదేళ్లకు..!

హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను వైసీపీ హయాంలో అటకెక్కించారు. ఆ తర్వాత మళ్లీ ఐదేళ్లకు చంద్రబాబు సీఎం అయ్యాక రూ.696 కోట్లతో పనులు మొదలయ్యాయి. కరువు సీమకు పుష్కలంగా కృష్ణా జలాలు మళ్లించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తున్నది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో తొలి దశ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. వివిధ దశల్లో పనులు ఉండగా వైసీపీ ప్రభుత్వం రాకతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం కూడా పనులు కొనసాగించి ఉంటే మూడేళ్ల క్రితమే విస్తరణ పూర్తి అయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు ఐదేళ్లపాటు ఆగిపోయాయి.



అసంపూర్తిగా పత్తికొండ జలాశయం

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ నీవా విస్తరణకు శ్రీకారం
- రూ.1,030 కోట్లతో పనులు
- వైసీపీ అధికారంలోకి రాగానే ఆగిపోయిన పనులు
- రూ.6,182.19 కోట్లతో టెండర్ల డ్రామా..
- గంపెడు మట్టి కూడా తీయని వైనం
- మళ్లీ కూటమి ప్రభుత్వం రాకతో మొదలైన పనులు

కర్నూలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతుల జీవనాడి హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ విస్తరణకు ఎట్టకేలకు అడుగులు పడ్డాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం దాదాపు రూ700 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం. శ్రీశైలం జలాశయం ఎగువన నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కరువు నేలకు మళ్లించేలా హంద్రీనీవా ప్రాజెక్టు చేపట్టారు. తొలి దశ (ఫేజ్-1) కింద కర్నూలు జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, 8 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 3,850 క్యూసెక్కుల నీరు ఎత్తిపోసేందుకు వీలుగా హైడ్రాలికల్ పర్టిక్యులర్స్ ప్రకారం ప్రధాన కాలువ 9.5 మీటర్లు బెడ్ విడ్త్ (కాలువ అడుగు భాగం వెడల్పు)తో నిర్మించాలి. సీసీ లైనింగ్ చేస్తే 12 పంపులు ద్వారా 3,850 క్యూసెక్కులు (ఒక్కో పంపు ద్వారా 330 క్యూసెక్కులు) లిఫ్ట్ చేసేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం 5-6 పంపుల ద్వారా 1,940 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసుకోలేని పరిస్థితి ఉంది. సీసీ లైనింగ్ చేస్తే భూగర్భ జలాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని గుర్తించిన టీడీపీ కూటమి ప్రభుత్వం 3,880 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరణకే మొగ్గు చూపింది. ఆరు నెలల్లో ఎంత తక్కువ లేదన్నా 60 టీఎంసీలు ఎత్తిపోసి నిల్వ చేస్తే కరువు సీమను సస్యశ్యామలం చేయవచ్చు.. తద్వారా రైతుల కష్టాలు తీర్చవచ్చని సీఎం చంద్రబాబు సంకల్పించారు.



కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ

మిగతా 7వ పేజీలో

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం 3,880 క్యూసెక్కులు హంద్రీనీవా ద్వారా తీసుకోవాలనే లక్ష్యంతో రూ.1,030 కోట్లతో కాలువ విస్తరణ పనులు చేపట్టారు. మూడు ప్యాకేజీలుగా విభజించి చేపట్టిన ఈ పనులు రుత్విక్, మెగా, హెచ్ఈఎస్ సంస్థలు చేపట్టాయి. దాదాపు రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం విస్తరణలో అవినీతి జరిగిందనే ఆరోపణలతో పనులు ఆపేసింది. విస్తరణకు జగన్ గ్రహణం పట్టింది. హంద్రీనీవా కాలువను 6,300 క్యూసెక్కుల విస్తరిస్తామంటూ రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్ట్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. కానీ వైసీపీ అధికారంలో ఉన్నంత కాల గంపెడు మట్టి కూడా తీయలేదు.

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

- గీత కార్మికుల నుంచి 5వ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 7న కలెక్టరేట్‌లో డిప్ ద్వారా కేటాయింపు

కర్నూలు అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గీత కార్మిక ఉప కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియకు సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ అయింది. ఆ మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం సుధీర్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 5 వరకు దుకాణాలకు దరఖాస్తులను ఆయా ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో స్వీకరిస్తారని తెలిపారు. 6వ తేదీని దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియ, 7న కలెక్టర్ డిప్ ద్వారా ఉదయం 10 గంటలకు ఎంపిక చేసి ప్రకటిస్తారు. అదే రోజు డిప్ ప్రక్రియలో ఎంపికైన వారికి దుకాణాలను కేటాయిస్తారు. ఈ క్రమంలో జిల్లాలో 99 దుకాణాలు గత డిసెంబర్లో కేటాయించిన విషయం తెలిసిందే. అందులో పది శాతం దుకాణాలను గీత కార్మిక ఉపకులాలకు కేటాయించారు. గౌడ్‌లకు కర్నూలు నగర పాలక సంస్థ, కృష్ణగిరి, కౌతాళం, ఈడిగలకు ఆదోని మున్సిపాలిటీ, ఆదోని రూరల్ మండలం, మద్దికెర, కోసిగి, చిప్పగిరి, ఆస్పరి, గౌడలకు ఎమ్మిగనూరు మున్సిపాలిటీ దుకాణాలను ఎక్సైజ్ శాఖ ప్రజలు, దుకాణాల కేటాయింపుల ఆధారంగా కొత్త దుకాణాలను ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు కేటాయించామని జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో యధావిధిగా దరఖాస్తులు స్వీకరిస్తారు. గీత కార్మికుల ఉపకులాలు గుర్తింపు సర్టిఫికెట్లు తప్పని సరిగా సమర్పించాలి.

వలసల నివారణకు బృహత్ ప్రణాళిక

- రూ. 300 కోట్ల కేటాయింపు ● డ్వామా పీడీ వెంకట సుబ్బయ్య



కర్నూలు అగ్రికల్చర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు వలసల నివారణకు బృహత్ ప్రణాళిక తయారు చేశామని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం డ్వామా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 3.24 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డు ఇచ్చామని, వాటిలో 2.56 లక్షల కుటుంబాల్లోని వ్యవసాయ కూలీలు, రైతులకు 4.61 లక్షల మందికి పని కల్పించామని అన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 3.55 లక్షల మంది ఈ పథకంలో పని చేశామని అన్నారు. 2024-25 సంవత్సరం నుంచి 99 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం కాగా 54.68 లక్షల పని దినాలు కల్పించామని అన్నారు. ఇందులో భాగంగా పంట కాలువల్లో పూడికతీత, చెక్‌డ్యాముల్లో పూడికతీత, ఫారం పాండ్స్, చెరువుల్లో పూడికతీత పనులు, మట్టికట్టల మరమ్మతులు, ఊటకుంటలు, అమృతసరోవరాలు, మినీ అమృత్ సరోవరాలతో పాటు సరిహద్దు కందకాలు భవనాలపై పడిన వర్షం నీటి సంరక్షణ, నీటి నిల్వ కోసం చెరువులు, కుంటల ఆధునికీకరణ తదితర పనుల కోసం రూ.162.37 కోట్లు కూలీలకు వేతనంగా ఇచ్చామని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.56.79 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. 2025-26లో కోటి పనిదినాల కల్పన లక్ష్యంగా చేసుకున్నామని, రూ.300 కోట్ల దాకా వేతనాలకు ఖర్చు చేస్తామని తెలిపారు.

రాజకీయాలను మార్చేసిన యువగళం

- సీమలో ప్రజాభిమానం చూరగొన్న లోకేశ్
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ రెండేళ్ల క్రితం చేపట్టిన యువగళం రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023 జనవరి 27న కుప్పంలో పాదయాత్ర ప్రారంభించి యువత, రైతాంగం, అన్ని వర్గాల సమస్యలపై భరోసా కల్పించి తెలుగుదేశం పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అరాచక, అప్రజాస్వామిక, హింస, కక్ష పూరిత, రాజకీయాలతో రాష్ట్రం అతలాకుతలమైందన్నారు. జగన్ పాలన తుగ్లక్‌ను మరిపించిందన్నారు. అంతటి కష్టకాలంలో నారా లోకేశ్ యువగళం పాదయాత్రకు శ్రీకారం చుట్టి పార్టీలోని నాయకులు, కార్యకర్తలకు పెద్ద దిక్కుగా ఉంటూ భరోసా కల్పించి పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. లోకేశ్ పాదయాత్రలో పాల్గొన్న 40 మంది వలంటీర్లపై కేసులు నమోదు చేసి రాజమండ్రి జైలుకు తరలించి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. రాయలసీమలో 124 రోజులు 44 నియోజకవర్గాలు, 1,587 కిలోమీటర్లు లోకేశ్ పాదయాత్ర సాగిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

లోకాయుక్తలో భారీగా కేసులు

అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లావే..

కర్నూలు లీగల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్తలో ఈ ఏడాది భారీగా కేసులు దాఖలైనట్లు రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని తెలియజేశారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 2,597 ఫిర్యాదులు దాఖలు కాగా, అందులో 2,327 పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో 567 కేసులు కేవలం ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే దాఖలైనట్లు ఆమె తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం, రాష్ట్రం నలుమూలల నుంచి దాఖలైన ఈ కేసులలో ఎక్కువ కేసులు త్వరగా పరిష్కారమైనందుకు ప్రజలలో లోకాయుక్త పట్ల నమ్మకం ఏర్పడిందని అన్నారు. లోకాయుక్త పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరిగేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ మేరకు క్యాంపు కోర్టులను కూడా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నామని ఆమె అన్నారు.

రూ.17.10 కోట్ల వసూలు లక్ష్యాన్ని అధిగమిస్తాం

మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ యార్డ్ 2024-25కిగాను రూ.17.10 కోట్ల ఆదాయపు వసూళ్ల లక్ష్యాన్ని అధిగమిస్తామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 27 తేదీ వరకు రూ.13.50 కోట్ల సెస్సు రూపంలో వ్యాపారుల నుంచి వసూలు చేసినట్లు తెలిపారు. గత ఏడాది జనవరి ఆఖరి నాటికి రూ.10.61 కోట్ల ఆదాయం సమకూరగా ఈ ఏడాది రూ.3 కోట్లు అధికంగా ఆదాయం రాబట్టగలిగామన్నారు. కనీస మద్దతు ధరతో రైతుల నుంచి పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొన్నదని తెలిపారు. సీసీఐ నుంచి రూ. 1.20 కోట్ల సెస్సు రావాల్సి ఉందన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

- డోన్‌లో అనంతపురం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్



డోన్ ఐటీఐలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలిస్తున్న అనంతపురం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కెండేయ

డోన్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలం పరిశీలన కోసం అనంతపురం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కండేయ సోమవారం డోన్‌కు వచ్చారు. డీఈవో జనార్దన్ రెడ్డి, ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నాగమణి, మండల విద్యాధికారి ప్రభాకర్‌లతో కలిసి పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి వద్ద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా నిర్మించిన భవనాన్ని కేంద్రీయ విద్యాలయం కోసం వారు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో 8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయని, ఇందులో భాగంగా డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ నివేదికను కేంద్రానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

16వ రోజు 415 మంది ఎంపిక

దేహదారుఢ్య పరీక్షలను పర్యవేక్షించిన ఎస్పీ

కర్నూలు క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు సోమవారం 16వ రోజు కూడా కొనసాగింది. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 738 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజకల్ ఎఫిషియన్సీ టెస్టులు 1600 మీటర్ల పరుగు పరీక్షలో 480 మంది, 100 మీటర్ల పరుగులో 277 మంది, లాంగ్‌జంప్‌లో 403 మంది, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 16వ రోజు 415 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్పీ, హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యవేక్షిస్తున్న నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

సర్వేయర్‌పై చర్యలు తీసుకోండి

ఏడీని ఆదేశించిన కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హాలహర్వి సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా సర్వే ఏడీని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఎట్ టూ వ్యూ ఆప్షన్ కింద హాలహర్వి మండల సర్వేయర్ 58 రోజులుగా సర్వే సమస్యపై పరిష్కరించకుండా దరఖాస్తును నేటి వరకు ఓపెన్ చేసి చూడలేదని అన్నారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌కు సంబంధించిన దరఖాస్తు ఏడు రోజులుగా పెండింగ్‌లో ఉందని, కార్మిక శాఖ లాగిన్‌లో గత 15 రోజులుగా ఒక దరఖాస్తును ఇంతవరకు ఓపెన్ చేసి చూడలేదని అన్నారు. ఓర్వకల్లు తహసీల్దార్ లాగిన్‌లో 49 రోజులుగా ఒక దరఖాస్తు పెండింగ్ ఉందని, డీసీసీ బ్యాంకు సీఈవో లాగిన్‌లో 8 రోజులుగా ఒక దరఖాస్తు పెండింగ్‌లో ఉందని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జెడ్ఎం ఏపీఐఐసీ లాగిన్‌లో ఏడు రోజులుగా ఒక దరఖాస్తు పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. లాగిన్‌లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూడాలని, గడువులోపు అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. రీఓపెన్ కేసులకు సంబంధించి 96 అర్జీలు రీఓపెన్ అయ్యాయని, అందులో పత్తికొండ ఆర్డీవో వద్ద 35, సబ్ కలెక్టర్ ఆదోని వద్ద 27 ఉన్నాయని, వాటిని నాణ్యతతో పరిష్కరించాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆర్డీవో కర్నూలు వద్ద 18, పత్తికొండ ఆర్డీవో వద్ద 12, సబ్ కలెక్టర్ ఆదోని వద్ద 10, వ్యవసాయ అధికారి వద్ద 2, జిల్లా రిజిస్ట్రార్, డీఎస్‌వో, డ్వామా వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని. వీటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్‌చార్జి డీఆర్వో టీకే వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

9 డెంగీ కేసులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జనవరిలో ఇప్పటి వరకు 9 డెంగీ కేసులు నమోదైనట్లు జోనల్ మలేరియా అధికారి డా. లక్ష్మణ్ నాయక్ తెలిపారు. సోమవారం నగరంలోని ఎర్రబురుజు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇళ్ల పరిసరాలు, పాత్రల్లో నీటి నిల్వలను జోనల్ మలేరియా అధికారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్, వైద్యాధికారి డా.తేజశ్రీ పాల్గొన్నారు.

సమస్యలపై అక్షర యుద్ధం

- కల్లూరు 29వ వార్డులో సమస్యలపై సదస్సు ● 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'
- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహణ ● హాజరు కానున్న ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్ రవీంద్రబాబు



కర్నూలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నగరం శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ చాలా కాలనీల్లో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయి. అధ్వానంగా రోడ్లు, పారుదల లేని మురుగు, కనీస వసతులు కరువైన పార్కు, వెలగని వీధి దీపాలతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో నేటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. వీటిపై ప్రయాణం నరకంగా మారింది. దోమల నివారణ చర్యలు లేకపోవడం వల్ల దోమల బెడద, కుక్కల స్వైర విహారం వంటి సమస్యలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటితో పాటు మరిన్ని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేందుకు 'ఆంధ్రజ్యోతి' ఓ బృహత్తర కార్యక్రమానికి సంకల్పించింది. మంగళవారం (నేడు) కర్నూలు కార్పొరేషన్ పరిధి.. కల్లూరు మండలంలోని 29వ వార్డు ఉద్యోగనగర్‌లో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' ఆంధ్రజ్యోతి పరిష్కార వేదిక సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సు ఉద్యోగనగర్‌లోని శారదా స్కూల్ ఆవరణలో ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు జరుగుతుంది. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడమే ఈ సదస్సు ముఖ్య లక్ష్యం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, ఇతర అధికారులు హాజరవుతారు.

మళ్లీ ఐదేళ్లకు..!

కూటమి ప్రభుత్వం వచ్చాక విస్తరణపై దృష్టి

(5వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తిరిగి హంద్రీ నీవా కాలువ విస్తరణపై దృష్టి సారించారు. గత ఏడాది సెప్టెంబరులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ నీవా కాలువను పరిశీలించారు. ఫేజ్-1లో భాగంగా 0/0 కిలోమీటర్ల నుంచి 88 కి.మీల వరకు రూ.250 కోట్లతో ప్యాకేజీ-1 కింద చేపట్టి విస్తరణ బ్యాలెన్స్ పనులు హైదరాబాద్‌కు చెందిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ, 88 కి.మీల నుంచి 216.30 కిలో మీటర్లు అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ వరకు రూ.450 కోట్లతో చేపట్టిన విస్తరణ బ్యాలెన్స్ పనులు ప్యాకేజీ-2 డీఎస్ఆర్-వీపీఆర్ జాయింట్ వెంచర్ కింద చేపట్టారు. హంద్రీనీవా ఇంజనీర్లతో ఒప్పందం చేసుకొని వారం పది రోజుల క్రితం పనులకు శ్రీకారం చుట్టారు. సీసీ లైనింగ్ చేపట్టకుండా కాలువను విస్తరించడం వల్ల కాలువ పక్కన ఉండే నందికొట్కూరు, పాణ్యం, పత్తికొండ, డోన్, ఆలూరు నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా బోరుబావుల కింద సాగు పెరుగుతుందని, తాగునీటి సమస్య తీరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జూన్ 15వ తేదీలోగా విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ ఆరు నెలల్లో సాధ్యమేనా..? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

విస్తరణ పనులు మొదలు పెట్టాం

నంద్యాల జిల్లా మాల్యాల పంప్‌హౌస్-1 నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 0/0 నుంచి 216.30 కిలోమీటర్ల దాకా 3,880 క్యూసెక్కుల సామర్థ్యంలో 2018లో రూ.1,030 కోట్లతో విస్తరణ పనులు చేపట్టారు. కొంత వరకు పనులు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం పనులు ఆపేసింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా విస్తరణ బ్యాలెన్స్ పనులకు ప్రతిపాదనలు పంపితే పరిపాలనా అనుమతులు ఇచ్చారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి దాదాపు రూ.696 కోట్లతో రెండు ప్యాకేజీల కింద విస్తరణ బ్యాలెన్స్ పనులు మొదలయ్యాయి. జూన్ రెండో వారంలోగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు గడువు పెట్టాం.

- నాగరాజు, హంద్రీనీవా ప్రాజెక్టు సీఈ, అనంతపురం జిల్లా

స్పర్శ కుష్ఠు వ్యాధిపై అవగాహన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం సునయన ఆడిటోరియంలో స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30న జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధిగ్రస్థులకు చేసిన సేవలను స్మరించుకుంటూ స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమష్టి కృషితో జిల్లాను కుష్ఠు రహిత జిల్లాగా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డా.ఎల్.భాస్కర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.శాంతికళ, జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి డా.జి.మల్లికార్జున రెడ్డి, జి.విజయప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ




ప్రాజెక్టు పనుల వద్ద డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ

కర్నూలు అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పందికోన, వేదవతి ప్రాజెక్టుల పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ నియోజకవర్గం పందికోన రిజర్వాయర్‌ను జిల్లా బృందం సందర్శించిందని తెలిపారు. ఈ రిజర్వాయర్ ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడం లేదన్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలకు సాగు, తాగు నీరు ఇవ్వాలని ఉన్నా అధికారులు అమలు చేయడం లేదని అన్నారు. ఫిబ్రవ రిలో నీటిని ఆపకుండా ఖరీఫ్ సీజన్ వరకు రైతులకు నీరందించాలని కోరారు. లేనిపక్షంలో రాయలసీమ జిల్లాల రైతులతో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆలూరు నియోజకవర్గం పరిధిలోని హాలహర్వి మండలం అమృతాపురం గ్రామం వద్ద గల వేదవతి ప్రాజెక్టు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని, రూ.1800 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అనంతరం 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో రూ.1600 కోట్లకు కుదించిందని, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదని అన్నారు. ప్రాజెక్టు పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమన్వయకర్తలు, ఎం.కాశీం వలీ, చిప్పగిరి లక్ష్మీనారాయణ, జి. రమేష్‌యాదవ్, ఓబీసీ చైర్మన్ డీవీ సాంబశివుడు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ యువకుడు దొరికాడు

- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో సంచలనంగా మారిన యువకుడి అదృశ్యం కథ సుఖాంతమైంది. ఎట్టకేలకు పోలీసులకు దొరికాడు. అతడ్ని ఆత్మకూరుకు రప్పించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రామాంజినాయక్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలోని తిక్కయ్యస్వామి దర్గా సమీపంలో నివసిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ మహెబూబ్‌బాషా కుమారుడైన నిరంజన్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల వల్ల యువకుడు రూ.13 లక్షల వరకు నష్టపోయాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఈ నెల 24న సూసైడ్ లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆ యువకుడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వారు అతని అచూకీ కోసం అనేక విధాలుగా ప్రయత్నించారు. చివరకు విజయవాడలో దొరికాడు. అక్కడి పోలీసులు నిరంజన్‌ను ఆత్మకూరుకు తీసుకొచ్చారు. సోమవారం ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక సమక్షంలో నిరంజన్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా కేసును త్వరితగతిన చేధించిన ఆత్మకూరు సీఐ రామును డీఎస్పీ అభినందించారు. ఆ తర్వాత యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

విద్యార్థులను చితకబాదిన హెచ్‌ఎం

- మద్యం మత్తులో వీరంగం
- పాఠశాలకు తాళం వేసిన గ్రామస్థులు
- సస్పెండ్ చేస్తూ డీఈవో ఆదేశాలు



పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్థులు

హొళగుంద, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ హెచ్‌ఎం విద్యార్థులను చితక బాదాడు. దీంతో తల్లిదండ్రులు ఆగ్రహించి పాఠశాలకు తాళం వేశారు. ఈ ఘటన హొళగుంద మండ లం ముద్దటమాగి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. ముద్దటమా గి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా జయరాజు విధులు నిర్వహి స్తున్నాడు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఆయన 11 గంటల సమయంలో పాఠశాలలో ని మరుగుదొడ్డి లోకి వెళ్లి మద్యం తాగడం మొదలు పెట్టాడు. మద్యం తాగుతుండడాన్ని ఓ విద్యార్థి చూడగా ఇక్కడికి ఎందుకు వచ్చావని గట్టిగా అరిచాడు. అనంతరం హెచ్‌ఎం తరగతి గదిలోకి వెళ్లి తలుపులు వేసి విద్యార్థులను ప్లాస్టిక్ పైప్‌తో చితకబాదాడు. విద్యార్థులు కేకలు విన్న గ్రామస్థులు పాఠశాల వద్దకు వెళ్లారు. విద్యార్థులు విషయాన్ని ఏడుస్తూ చెప్పడంతో ప్రధానోపాధ్యాయుడు జయరాజుతో వాగ్వాదానికి దిగారు. మండల విద్యాధికారి జగన్నాథంకు సమాచారం ఇచ్చారు. ఆయన పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. హెచ్‌ఎం జయరాజును పాఠశాల నుంచి తొలగించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరించారు. ఇలాంటి ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలకు పిల్లలను పంపించబోమని పాఠశాలకు తాళం వేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. విషయం డీఈవో దృష్టికి ఎంఈవో తీసుకువెళ్లగా ఆయనను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీఈవో శ్యామ్యూల్‌పాల్ ఆదేశాలు జారీ చేశారు.

హెచ్‌ఎంపై చర్య

కర్నూలు ఎడ్యుకేషన్: హొళగుంద మండలం ముద్దటమాగి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు జయరాజు సస్పెండ్ అయ్యాడు. మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదిన ఘటనలో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో శ్యామ్యూల్ పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల టాయిలెట్‌లో విద్యార్థులు మద్యం సీసాలు చూశారన్న ఆగ్ర హంతో విద్యార్థులను చితకబా దారని ఎంఈవో జగన్నాథం నివేదిక ఇచ్చారు. ఈ మేరకు హెచ్‌ఎం ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చారు.

క్షుద్ర పూజల కలకలం

కర్నూలు క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ కాలేజీలో ఓ బాలికపై క్షుద్ర పూజలు జరిగినట్లు కలకలం రేగింది. శ్రీశైలానికి చెందిన విద్యార్థిని స్థానిక ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి తర్వాత ఆ విద్యార్థిని జుట్టు కత్తిరించి నిమ్మకాయలు కోసి ఓ లెటరు రాసి ఆ యువతి సమీపంలో పెట్టారు. 'మాకన్నా ఎలా బాగా చదువుతావు.. మేం చూస్తాం' అని అందులో రాశారు. ఆ తర్వాత ఆ విద్యార్థిని చెయ్యి తెగినట్లుగా ఉండడాన్ని కళాశాల యజమాన్యం గమనించి ప్రథమ చికిత్స చేయించింది. తల్లిదండ్రుల దృష్టికి ఈ విషయం వెల్లడంతో సోమవారం రాత్రి కళాశాలకు వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. కళాశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అనంతరం తాలుకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కళాశాలలో జరిగిన సంఘటనపై విచారించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఐ శ్రీధర్‌ను వివరణ కోరగా.. కళాశాలలో జరిగిన సంఘటన తమ దృష్టికి వచ్చిందని, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయలేదని అన్నారు. జరిగిన సంఘటనపై విచారిస్తున్నామని తెలిపారు.

రాజకీయాల్లో యువగళం ఓ మలుపు

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లోనే యువగళం పాదయాత్ర ఓ పెద్ద మలుపు అని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. చారిత్రాత్మక యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా హుశేనాపురంలో సోమవారం ఆయన మాట్లాడారు. యువ నేత, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఐదేళ్ల అరాచక వైసీపీ పాలనపై సమరశంఖం పూరించారని అన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ యువనేత పాదయాత్ర సాగిందని తెలిపారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజ కవర్గాలు, 232 మండలాలు, 2097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర యువగళం పాదయాత్ర జరిగిందని గుర్తు చేశారు. ప్రజల కష్టాలు వింటూ, కన్నీళ్లు తుడుస్తూ సాగిన పాదయాత్ర ప్రజా క్షేత్రంలో సంపూర్ణ విజయం సాధించిందన్నారు. యువగళం సాగిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారంటే పాదయాత్ర ఎంతటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ రెడ్డి ఎన్ని అడ్డంకులు సృష్టించినా తగ్గేదే లేదంటూ పట్టుదలతో పాదయాత్ర చేశారన్నారు. 124 రోజుల పాటు 44 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1587 కిలోమీటర్ల మేర రాయలసీమలో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా సాగిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం డీఎస్సీపై చేశారని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయమని చెప్పిన విధంగా హామీలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, బజారు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన యువగళం



కేక్ కట్ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడి యువతలో భవిష్యత్‌పై స్ఫూర్తి నింపేలా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగం పాదయాత్ర సాగిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో కలిసి ఆమె కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 5 కోట్ల మంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ కుప్పం వరదరాజస్వామి పాదాల చెంత నుంచి 2023 జనవరి 27వ తేదీన పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లిన యువనేత నారా లోకేశ్ యువగళంతో రాష్ట్ర రాజకీయాలను మార్చేశారన్నారు. ఉద్యోగాల్లేక నిరాశతో కొట్టుమిట్టాడుతున్న యువత ఒక వైపు ఇంటి నుంచి బయటకు వెళ్లే తిరిగి క్షేమంగా వస్తామనే గ్యారెంటీ లేక భయాందోళనలో మహిళలు మరోవైపు గగ్గోలు పెడుతున్న సమయంలో వారందరిలో స్ఫూర్తిని నింపి ముందుకు నడిపించి ప్రగతిపథం వైపు అడుగులేసేలా చేశారన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంటు రామకృష్ణ, తెలుగు యువత నాయకుడు గంగాధర్‌గౌడు, నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్ యాదవ్, రామాంజనేయులు, జనసేన బజారన్న తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో చోరీ

- 6 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరణ

బనగానపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న వ్యాపారి చిన్నపురెడ్డి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. చిన్నపురెడ్డి సతీమణి సుజాత పుట్టినిళ్లు మహానంది మండలం తమ్మడపల్లెకు వెళ్లింది. చిన్నపురెడ్డి టిఫిన్ చేసి వ్యాపారం నిమిత్తం వెళ్లాడు. ఉదయం 9గంటల అనంతరం చిన్నపురెడ్డి బయటకు వెళ్లిపోగా దొంగలు తలుపుల తాళాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ. లక్ష నగదు, ఆరు తులాల బంగారు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. ఫోరెనిక్స్ నిపుణులను రప్పించి ఫింగర్ ప్రింట్ తీసినట్లు ఆయన పేర్కొన్నారు.

గోపవరంలో..

మహానంది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరం గ్రామంలోని ఒక ఇంటిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు తెలిసింది. గ్రామ ప్రధాన కూడలిలోని సుంకులమ్మ ఆలయ సమీపంలోని ఒక ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఇంట్లోని బీరువాను పగలకొట్టి విలువైన వస్తువులు, పత్రాలను దొంగలించుకొని వెళ్ళినట్లు సమాచారం. ఇంటి యజమాని బంధువుల శుభకార్యక్రమం కోసం వేరే ఊరికి వెళ్ళినట్లు తెలిసింది. చోరి విషయంపై మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగాఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

వివాహిత అదృశ్యం

గడివేముల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన సుజాత ఈ నెల 21వ తేదీ నుంచి కనపడటం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మూడేళ్ల క్రితం మరణించాడని, ఒక కొడుకు, కూతురు ఉన్నారని వారు తెలిపారు. సుజాత మామ పెద్దనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆమె కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

గురుకులం నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

- ఎమ్మిగనూరులో పట్టుకున్న పోలీసులు

సి. బెళగల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకులం పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను సోమవారం ఎమ్మిగనూరు పోలీసులు పట్టుకొని ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నవీన్ ఏడో తరగతి, సూర్యతేజ ఆరో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ అక్కాచెల్లెళ్ల పిల్లలు. కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన నవీన్, కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన సూర్యతేజ కలిసి సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో పాఠశాల నుంచి ఆటో ఎక్కిపోయారు. వీరు ఆటో ఎక్కిపోవడాన్ని చూసిన విద్యార్థి మిథిన్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజేయుడుకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ సి.బెళగల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గాలింపు ముమ్మరం చేశారు. అయితే మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ ఈ విషయాన్ని ఫేస్‌బుక్ గ్రూపులో షేర్ చేశాడు. దీంతో ఎమ్మిగనూరులో మెడికల్ స్టోర్ నడుపుకుంటున్న జూలకల్ మిన్నెల్ల ఫేస్‌బుక్‌లో వచ్చిన విద్యార్థులను శివ సర్కిల్ చూసి వారు వీరేనని గుర్తు పట్టాడు. అనంతరం వారిని తీసుకెళ్లి ఎమ్మిగనూరు పోలీసులకు అప్పగించారు. అనంతరం వారు కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పిల్లలను సి.బెళగల్‌కు తీసుకొచ్చి ప్రిన్సిపాల్ విజేయుడుకు అప్పగించారు. విద్యార్థులను గుర్తు పట్టి ఎమ్మిగనూరు పోలీసులకు అప్పగించిన మిన్నెల్లను, ఫేస్‌బుక్‌లో షేర్ చేసిన సి.బెళగల్ మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్‌ను సీఐ సన్మానించారు. కార్యక్రమంలో గూడూరు ఎస్ఐ తిమ్మయ్య, స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

నేడు 20 సూత్రాల అమలు సమావేశం

నంద్యాల కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 20 సూత్రాల అమలు పథకం విస్తృత స్థాయి సమావేశం మంగళవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో జరుగుతుంది. నంద్యాల కలెక్టర్ రాజకుమారి, 20 సూత్రాల అమలు పథకం చైర్మన్ లంకా దినకర్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్స్ ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని తమ గ్రామ, వార్డులలోని సమస్యలు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని తెలిపారు. అలాగే బీజేపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4గంటల వరకు 20 సూత్రాల అమలు పథకం చైర్‌పర్సన్ లంకా దినకర్ విలేకరుల సమావేశం, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిసింది.

నాణ్యమైన పరిష్కారం చూపండి

- ఎంఎస్‌ఎంఈ సర్వేపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రాజకుమారి
- పీజీఆర్‌ఎస్‌కు 189 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యంగా, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో జరిగిన జీజీఆర్ఎస్ మినిట్స్ సిఎంఓ పీజీఆర్ఎస్ గ్రూపులో నోడల్ అధికారికి పోస్ట్ చేయాలన్నారు. రీసర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి నిర్దేశిత వ్యవధిలోగా పరిష్కరించడంతో పాటు ఆడిట్ చేయాలని అన్నారు. పరిష్కరించ దగిన సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి వాస్తవాలు నిర్ధారణ చేసుకొని సరి చేసుకోవడంతోపాటు రీజాయిన్డెర్లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బందిచే ఎంఎస్‌ఎంఈ సర్వే పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. హౌస్ హోల్డ్ మాపింగ్ సంబంధించి డీఈవో, పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం తదితర శాఖలో 68,593 మంది మ్యాపింగ్ పెండింగులో ఉందని, రెండురోజుల్లో పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 40 దరఖాస్తులు రీఓపన్ అయ్యాయని, 27 సీఎంఓ దరఖాస్తులు కూడా రీఓపన్ అయ్యాయని వీటన్నిటిని తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులన్నింటినీ చివరి 71 గంటల్లోగా నాణ్యంగా పరిష్కరించాలన్నారు. కోవెలకుంట్ల మండలంలో ఎస్ఆర్బీసీ కాలువ ఓవర్ ఫ్లో కారణంగా 140 హెక్టార్లలో శనగ పంట దెబ్బతినిందని, వ్యవసాయ శాఖ, ఎస్ఆర్బీసీ జాయింట్ నివేదికలు ఇస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ జిల్లాలో నమోదు చేయని 15వేల ఎకరాలను వారం రోజులలో నమోదు చేసి తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌ల నుండి పంపాలన్నారు. రెవిన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అర్జీలను పరిష్కరించాలి: కమిషనర్


సమస్యను తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలను పరిష్కరించాలని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను కమిషనర్ స్వీకరించారు.

● అన్న క్యాంటీన్ల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పాలని కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం వై. జంక్షన్ సమీపంలోని పరిమళనగర్ అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

ఓర్వకల్లు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపుల్లో ఉండే సభ్యులకు ఆర్థికపరమైన పథకాలపై అవగాహన కల్పించాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. 100 రోజుల జీవనోపాదుల జాతరలో భాగంగా సోమవారం మెప్మాలో పని చేస్తున్న సిబ్బందికి, పట్టణ సమాఖ్య ఓబీలు, సమాఖ్య ఆర్‌పీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం ఉండే సోపానం అనే పుస్తకాన్ని అందజేశారు. టీఎంసీలు సుధాకర్, భారతి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు

కర్నూలు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ రెగ్యులర్ తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు సోమవారం విధుల్లో చేరారు. తహసీల్దార్ తండ్రి తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో కొన్ని రోజులు చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వెంటరమేష్‌బాబు గత నెల 9వ తేదీ నుంచి సెలవులో వెళ్లారు. అంతవరకు కర్నూలు అర్బన్ మండల తహసీల్దార్ వెంటలక్ష్మికి కలెక్టర్ రూరల్ మండల బాధ్యతలను అదనంగా అప్పగించిన విషయం తెలిసిందే. అన్ని కార్యక్రమాలను ముగించుకొని వెంకట రమేష్‌బాబు తిరిగి రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

'పొగాకు పంటను కొనుగోలు చేయండి'

ఓర్వకల్లు, జనవరి 27: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పొగాకు పంటను కొనుగోలు చేయా లని జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి సూచించారు. సోమవారం ఓర్వకల్లులో ఐటీసీ కంపెనీ కొనుగోలు చేస్తున్న పొగాకును ఆమె పరిశీలించారు. గ్రేడింగ్, నాన్ గ్రేడింగ్ ప్రొడక్ట్ నాణ్యత, ధర తదితర వాటిపై అడిగి తెలుసుకు న్నారు. అనంతరం హుశేనాపురం గ్రామంలో ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా కింద పంట కోత ప్రయోజనాన్ని నిర్వహించారు. ఏవో సుధాకర్, ఏఈవో గిరి, ఉన్నారు.

పొదుపు గ్రూపు సభ్యురాలికి చేయూత

కర్నూలు న్యూసిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో పొదుపు గ్రూపు సభ్యురాలు వరలక్ష్మి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఆ కుటుంబానికి రీసోర్స్ పర్సన్ నాగమణి మానవతా దృక్పథంతో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేసింది.



ఆహ్లాద కాలనీలో అపార కష్టాలు..!

కల్లూరు.. ఒకనాడు అదో పల్లెటూరు. కర్నూలు మున్సిపాలిటీని నగర పాలక సంస్థగా విస్తరించారు. 2002లో కల్లూరు, 2019లో పందిపాడు గ్రామాలు కర్నూలు కార్పొరేషన్‌లో విలీనమయ్యాయి. పంచాయతీలో ఉన్న గ్రామాలు ప్రస్తుతం కార్పొరేషన్‌లో అంతర్భాగమై 29వ వార్డులోకి చేరాయి. హోదాతో పాటుగా పన్నులు కూడా పెరిగాయి. ఆ స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని కాలనీ వాసుల ఆవేదన. దినదినాభివృద్ధి చెందుతున్న వార్డులో మురుగు కాలువలు, రోడ్లు, తాగునీటి వంటి సమస్యలతోపాటు పారిశుధ్యం, వీధి దీపాలు వంటి సమస్యలు తీర్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. జనం గొంతుకుగా ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండగా'గా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం అదే వార్డులోని ఉద్యోగుల కాలనీలో ఉన్న శాదర స్కూల్‌లో పరిష్కార వేదిక నిర్వహిస్తున్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు హాజరవుతున్నారు.

కల్లూరు/కర్నూలు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి జలవడ్డానంలా హంద్రీ నది ప్రవహిస్తోంది. రాయలసీమ జిల్లాల్లో ముఖ్య నదుల్లో ఒకటైన హంద్రీనది పత్తికొండ సమీపంలో పురుడు పోసుకొని పశ్చిమ దిశగా ప్రవహిస్తోంది. కర్నూలు నగరం శివారున జొహరాపురం సమీపంలో తుంగభద్ర నదిలో కలుస్తుంది. హంద్రీ నదీతీరంలో పందిపాడు, కల్లూరు.. తదితర పంచాయతీలు ఉన్నాయి. పాతికేళ్ల క్రితం వెనక్కి వెళితే.. నదీతీరంలో ఇరువైపుల వ్యవసాయ భూములు పచ్చని పైర్లతో కళకళలాడేవి. రైతులకు జీవనాధారంగా ఉండేది. కల్లూరు పంచాయతీని కర్నూలు కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో పల్లె వాతావరణం మారిపోయింది. జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో 29వ వార్డు నగరంలో మంచి కాలనీలోగా అభివృద్ధి చెందింది. ఈ వార్డులో ప్రస్తుతం 11 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. 4 వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. 18-20 వేలు జనాభా ఉంటుంది. ఉద్యోగ నగర్, కృష్ణప్రియనగర్, సొసైటీ కాలనీ, మహ్మద్‌నగర్, వాసు నగర్, విజయనగర్ కాలనీ, పార్థసారథి నగర్, సవారితోట, సుంకన్న కాలనీ, లావణ్య నగర్.. ఇలా పలు కాలనీల సమ్మేళనమే 29వ వార్డు. అయితే నగరపాలక సంస్థలో ఆ కాలనీ పేర్లతో కాకుండా 29వ వార్డు పేరుతోనే గుర్తింపును ఇస్తున్నారు.



● నాడు పంచాయతీ నేడు నగర పాలికలో అంతర్భాగం
● కర్నూలు కార్పొరేషన్‌లో కల్లూరు, పందిపాడు విలీనం
● 29వ వార్డుగా కొనసాగుతున్న వైనం
● విస్తరణ కాలనీలో సమస్యలు తిష్ఠ
● నేడు 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'
● హాజరుకానున్న ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్ రవీంద్రబాబు

పట్నంగా మారిన పల్లె

కర్నూలు 1762లో మున్సిపాలిటీగా ఏర్పడింది. 1995లో నగరపాలక సంస్థ (కార్పొరేషన్)గా హోదా పెంచారు. ఆ సమయంలో కల్లూరు పంచాయతీని నగర పాలక సంస్థలో విలీనం చేశారు. అప్పటి వరకు పల్లెగా ఉన్న కల్లూరు నగరంలో అంతర్భాంగా మారింది. కల్లూరును ఆనుకొని ఉన్న పందిపాడు పంచాయతీ ఈ తరువాత కూడా కార్పొరేషన్‌లో వీలినం చేశారు. 1995లో ప్రథమ మేయర్‌గా బంగి అనంతయ్య పనిచేశారు. తరువాత పదేళ్లు ఎన్నికలు జరగలేదు. 2000లో ఫిరోజ్‌బేగం, 2005లో ఎస్.రఘురామిరెడ్డి మేయర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం టీవై రామయ్య కొనసాగుతున్నారు. మొత్తం 52 వార్డులు ఉంటే.. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో 36, పాణ్యం నియోజకవర్గంలో 16, కోడుమూరు నియోజవకర్గంలో 4 వార్డులు ఉన్నాయి. 29వ వార్డు పాణ్యం నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.



జిల్లాలోనే ఏకైక సూర్యదేవాలయం

కల్లూరు అర్బన్ పరిధిలోని 29వ వార్డులో స్థాపించిన సూర్యదేవాలయం జిల్లాలోనే ఏకైక దేవాలయం. దత్తపీఠం కూడా ఇది. దినాదినాభివృద్ధి చెందుతున్న ఈ ఆలయంలో శాస్త్రోక్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నారు. ఏటేటా జరిగే ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు హాజరు అవుతారు.



వరసిద్ధి వినాయక ఆలయం అభివృద్ధి

హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు ప్రధాన జాతీయ రహదారి పక్కనే గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో చిన్న వరసిద్ధి వినాయక ఆలయం ఉండేది. అయితే రహదారి విస్తరణలో ఆ ఆలయం కనుమరుగైంది. 29వ వార్డు ప్రజలు వరసిద్ధి వినాయకుడి విగ్రహం తీసుకొచ్చి కాలనీలో ప్రతిష్టించారు. భక్తులు, కాలనీ వాసులు చందాలతో ఆ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. రోజువారి పూజ కార్యక్రమాలతోపాటు కాలనీ వాసులు వివిధ ఫంక్షన్లు జరుపుకోవడానికి వీలుగా ఓ ఫంక్షన్ హాల్ కూడా నిర్మించారు.



తాగునీటి సమస్య తీర్చాలి

మా కాలనీలో కొత్తగా విస్తరించింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. బిందెడు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతనిధులు, నగర పాలక సంస్థ అధికారులు స్పందించి మా కాలనీలో సమస్యల పరిష్కరించాలి. - ఎల్.సుధాకర్, కస్తూరి నగర్



దినదినాభివృద్ధి చెందుతోంది

29వ వార్డు దినదినాభివృద్ధి చెందుతుంది. హంద్రీ నది ఒడ్డునే ఉంది. ఒకనాడు పచ్చని పొలాలలో ఉండే ఈ ప్రాంతం కర్నూలు నగరం విస్తరణలో భాగంగా పాతికేళ్ల క్రితం ఏర్పడింది. విస్తరణతో పాటు సమస్యలు కూడా విస్తరించాయి. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. - టి. శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్, జడ్పీ ఉన్నత పాఠశాల



గతంలో వేసిన సీసీ రోడ్లే

కర్నూలు నగరపాలక సంస్థలో 29వ వార్డుగా ఉన్నా.. ఇక్కడే వివిధ కాలనీల కలయికతో వార్డుగా ఏర్పడింది. సుమారు 11 వేల ఓటర్లు ఉన్నారు. మెజారీగా ఇక్కడ ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉంది. నాటి ఎమ్మెల్యే గౌరు చరిత ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రూ.13 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయించారు. ప్రస్తుతం కూడా కాలనీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. - రామకృష్ణ, సొసైటీ కాలనీ

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా

● పరిష్కార వేదిక	: శారద స్కూల్
● కాలనీ	: ఉద్యోగ నగర్, 29వ వార్డు
● ముఖ్య అతిథులు	: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కమిషనర్ రవీంద్రబాబు
● సమయం	: ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిం చాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కోరారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా సోమవారం స్థానిక గౌరిగోపాల్ హాస్పిటల్ కూడలిలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయల్ అఫీషియల్స్ ప్రొఫెషనల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీజీ వెంకటేశ్ ముఖ్యఅతిథి గా హాజరై ప్రసంగించారు. రాయల్ అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ నాయకులు వై.సత్యనారాయణ, ఆద్యా రామ కృష్ణ, కోనేటి చంద్రబాబు, చింతలపల్లి రామకృష్ణ, మాజీ డీఎస్పీలు రామనాథ్, వెంకటేశ్వరరావు, కొట్టె చెన్నయ్య, కోనేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

కర్నూలు కల్చరల్: సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో ఈనెల 30 నుంచి జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. సోమవారం మౌర్యఇ న్‌లోని ఆయన చాంబర్‌లో నగర బ్రాహ్మణ సంఘం నాయకులు టీజీ వెంకటేశ్‌ను కలిసి ఆయనను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిం చారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, సీవీ దుర్గా ప్రసాద్, టీవీ రవిచంద్రశర్మ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల పేరుతో విద్యార్థుల ప్రాణాలను బలి కోరుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐడీఎస్‌వో, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఆత్మహత్యలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు హరీష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

తాండ్రపాడులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినిపై దాడి చేసిన వారిని శిక్షించాలని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులను విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. సోమవారం ఆర్ఐవో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలిపారు. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌బాబు, ఆలిం డియా స్టూడెంట్స్ అసోసియేషన్ చీఫ్ సెక్రటరీ నాగరాజు, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

దళిత జాతికే గర్వకారణం

కర్నూలు రూరల్ జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగక పద్మశ్రీ అవార్డు రావ డం దళిత జాతికే గర్వకారణమని కోడుమూరు నియోజకవర్గ టీడీపీ నాయకుడు పేరపోగు పెద్ద లక్ష్మన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డును ఇస్తున్నట్లు ప్రకటించడంతో సోమవారం కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామంలో టీడీపీ దళిత నాయకులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు.

'కృష్ణా బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలి'

గూడూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కృష్ణానది యజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు ఎంపీటీసీ మద్దిలేటి, అల్లీఫ్ బాషా అన్నారు. సోమవారం గూడూరు తహసీల్దార్ కార్యాల యంలో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు.

ఏపీజీబీ కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

కర్నూలు న్యూసిటీ: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని ఏపీ ఎస్సీఎస్టీ పోరమ్ నాయకులు జయరాజు కోరారు. సోమవారం జడ్పీ కాంప్లెక్స్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

సినీ కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సినీ కళాకారులకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ 24 క్రాఫ్స్ అసోసియేషన్ సినీ కళాకారులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సినిమా షూటింగ్‌లకు అనుమతులు ఇవ్వాలని, జిల్లాలో చిత్రపరిశ్రమ అభివృద్ధి కోసం కార్యాలయం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, మౌలాలి, నరసింహులు, వెంకట్రాముడు, శ్రీను, రవీంద్ర పాల్గొన్నారు.

● నగరంలో ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులను సీజ్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసులు, బీసన్న, నాగరాజు పాల్గొన్నారు.

● రోడ్డు ప్రమాదంలో మరణించిన సోమేశ్వరి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ, డీవైఎఫ్ఐ సంఘం నాయకులు కోరారు. సోమ వారం ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వారు వినతి పత్రం అందజేశారు.

● జీతం ఇవ్వకుండా మానసికంగా వేధిస్తున్న కర్నూలు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ


కలెక్టరేట్ ఎదుట అర్జీదారులు

సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో నగరంలో బి.క్యాంపు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆనంద్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

● నగరంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి రాజేష్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు రాజు, విజయ్, అఖిల్, స్వామి పాల్గొన్నారు.

● ఉలిందకొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ తన 8 ఎకరాల పొలాన్ని నగరానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జా చేశాడని సోమవారం కలెక్టర్ రంజిత్ బాషా వినతి పత్రం అందజేశారు.

బి.తాండ్రపాడు సర్పంచ్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న బి.తాండ్రపాడు సర్పంచ్ జయన్న

కర్నూలు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి. తాండ్రపాడు గ్రామ పంచాయతీ సర్పంచు ఆకెపోగు జయన్న ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. బి.తాండ్రపాడు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికైన సందర్భంగా గణతంత్ర దినం పురస్కరించుకొని ఈనెల 26వతేదీన కేంద్ర రాష్ట్ర పంచాయతీరాజ్ మినిస్ట్రీకి సంబంధించిన ప్రతినిధి ఎస్పీసింగ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు సర్పంచు జయన్న సోమవారం తెలిపారు. కోడుమూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో తాండ్రపాడుకు ప్రభుత్వ నిధులను కేటాయించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ అవార్డు పొందినందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని సర్పంచు ఆకెపోగు జయన్న తెలిపారు..

పరిశోధనలో విద్యార్థులు ముందుండాలి

కర్నూలు అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో విద్యార్థులు ముందుండాలని ఉపకులపతి డీవీఆర్ సాయి గోపాల్ అన్నారు. సోమవారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులను ఉపకులపతి అభినందించారు. ఉత్తమ పరిశోధన పత్రానికి రూ. 2 వేల నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నిఖిల్, లక్ష్మీనరసింహ అనే విద్యార్థుల పత్రాలు ప్రథమ స్థానంలో ఎంపికయ్యాయన్నారు. రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, బీఆర్ ప్రసాదరెడ్డి, అక్తర్ భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి కియా సిరోస్ కారు


నూతన కియా సిరోస్ కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు రూరల్ జనవరి 27(ఆంధ్రజ్యోతి): మార్కెట్లోకి కియా కంపెనీ తయారు చేసిన మరో కొత్త సబ్-కాంపాక్ట్ ఎస్‌యూవీ రకం కారు విడుదలైంది. ఈ కారుకు ఆధునిక డిజైన్‌తో మంచి ఫీచర్లు ఉన్నాయి. కియా సిరోస్ కొత్త కారును కర్నూలు నగరంలోని ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో సోమవారం ఎంజీ బ్రదర్స్ సీఈవో ఆదిత్య మాచాని చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకియా సిరోస్ కారు పెట్రోల్, డీజిల్ మాన్యువల్, ఆటోమెటిక్ వెరియంట్లలో 8 ఆకర్షణీయమైన రంగులలో ఉంటుందన్నారు. 30 దాక డిస్‌ప్లే, స్టాండింగ్‌తో కూడిన రెక్లైనర్ మోడల్‌లో ఉన్న వెనక సీటు, స్ట్రీమ్‌లైన్ డోర్ హ్యాండిల్స్ ఓటీఏ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వంటి ఫీచర్లతో ఈతరహా సెగ్మెంట్‌లో సిరోస్ మొదటిదని ఆయన వివరించారు. కార్యక్రమంలో జన రల్ మేనేజర్ సర్వీస్ టి.రత్నకాంతికుమార్, శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కందుల విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి

కోడుమూరు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కందులను మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. సోమవారం వర్కూరులో ఆర్ఎస్కేను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. బహిరంగ మార్కెట్‌లో కంది ధర తక్కువగా ఉండడంతో ప్రభుత్వం రూ. 7550 మద్దతు ధర కల్పించి కొనుగోలు చేపట్టిందని తెలిపారు. కంది విక్రయించాల ను కునే రైతులు ఆర్ఎస్కేలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం

ఆదోని టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన బోయ శివ(35) కుటుంబ సభ్యులను మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి సోమవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడి ఆదేశాల మేరకు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. మృతుడి భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

వైద్యుడు అదృశ్యం



వెంకటసుబ్బయ్య(ఫైల్)

ఆదోని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుడు వెంకటసుబ్బయ్య అదృశ్యమయ్యారని భార్య మాధవి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో తాము నివాసంటున్నారు. భర్త వెంకటసుబ్బయ్య ప్రభుత్వ ఆసుపత్రిలో సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 22న హైదరాబాద్‌లో స్వప్న అనే మహిళ తమకు డబ్బులు ఇవ్వాల్సి ఉండటంతో హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు భార్యకు చెప్పి బయలుదేరాడు. 24వ తేదీన భర్తకు ఫోన్ చేయగా తాను ఆదోనికి ఎమ్మిగనూరు సమీపంలో వస్తున్నట్లు చెప్పారు. అయితే ఇవతరవకు ఇంటికి రాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేవారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు.

మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడంపై హర్షం

హొళగుంద, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారంపై టీడీపీ నాయకుడు చిన్నహ్యాట శేషగిరి హర్షం వ్యక్తం చేశారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు.

మైనర్ డ్రైవింగ్‌పై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మైనర్లు, ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, న్యాయవాది జీవన్ సింగ్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల మైనర్లు కారు, బైకు డ్రైవింగ్‌తో బైపాస్‌లో ఇద్దరు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బైకులు ఇవ్వకుండా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. డీఎస్పీ, సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. రోటరీ క్లబ్ సభ్యులు సనత్ కుమార్, సునీల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాంప్రసాద్, భరత్ గాంధీ, సోమశేఖర్ రెడ్డి, రాయచోటి సుబ్బయ్య, విట్టా రమేష్, షాబీర్, వికాస్ జైన్ నితీష్ గాంధీ, శేషయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



కొండయ్య(ఫైల్)

మద్దికెర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బురుజుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దబ్బర కొండయ్య (82) సోమవారం ఉదయం మృతి చెందాడు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం ఎనలేని సేవలు చేస్తూ వచ్చాడు. కుమారుడు దబ్బర ఎర్రిస్వామి మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఐదేళ్లపాటు ప్రజలకు సేవలు అందించారు. పార్టీ నాయకులు కేశవులు, రంగస్వామి, శ్రీనివాసులు, వెంకటప్ప నివాళి అర్పించారు.

రీ సర్వేలో తప్పులు ఉండకూడదు

మద్దికెర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో తప్పులు ఉండకూడదని తహసీల్దార్ హుశేన్‌సాసెబ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రోజుకు 20 ఎకరాల్లో సర్వే చేయాలని, రైతులకు ముందుగా సమాచారం ఇచ్చి, వారి ఆమోదం మేరకే సర్వే చేయాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్ చేయాలని రైతులు అభ్యంతరం తెలిపితే నిలిపివేయాలన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

పత్తికొండ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎంఏ రమేష్ హెచ్చరించారు. సోమవారం పట్టణ శివారులోని సర్వే నెంబరు 308- 3 ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వ్యక్తులు పనులు చేస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ చేరుకొని, ఎక్స్‌వేటర్‌ను సీజ్ చేశారు. ఈ సర్వే నెంబరులో 1.92 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, 2021లో నిరుపేదలకు పట్టాలు ఇచ్చామన్నారు. పాత పట్టాలు రద్దు చేసి అర్హులైన నిరుపేదలకు నూతనంగా పట్టాలు జారీ చేస్తామన్నారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

ఆలూరు రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన కురువ బండారి ఈరన్న కుంటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గిరి, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు రాంగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద కన్వీనర్ మల్లికార్జున అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కూటమి నాయకులు ఫీల్డ్ అసిస్టెంట్, డీలర్‌షిప్ పోస్టులకు రూ.లక్షలు దండుకొని హత్యలు చేయిస్తున్నారన్నారు. వీరేష్, జిల్లా కార్యదర్శి ఈరన్న, నాయకులు మరకట్టు ఎల్లప్ప, జీర గౌడ్, దేవేంద్రప్ప, వరుణ్, శేఖర్, పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల అట్టలు పంపిణీ

దేవనకొండ,జనవరి27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నెకల్ జడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు అట్టలు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం క్రిష్ణమూర్తి తెలిపారు. విశ్రాంత ఎస్పీ యం.నారాయణ, వినియోగదారుల సంఘం సభ్యుడు నరహరినారాయణరెడ్డి, సుధాకర్‌బాబు వెంకప్ప పాల్గొన్నారు.

హత్యకేసు దర్యాప్తు వేగవంతం

● అనుమానితుల కాల్ డేటా పరిశీలన

ఆలూరు , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్న హత్యకేసు విచారణను పోలీసులు వేగవంతం చేస్తున్నారు. ఈ కేసును కొలిక్కి తెచ్చేందుకు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు అనుమానితుల కాల్ హిస్టరీ పరిశీలించడంతో పాటు ఉపాధి అధికారులను సైతం విచారి స్తున్నారు. ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్సై దిలీప్ కుమార్ సాంకేతికను ఉపయోగించి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అరికెర గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది.

ముంచిన వేరుశనగ

● ఫంగస్ దెబ్బకు కాయలు రాని వైనం
● తీవ్రంగా నష్టపోయిన రైతులు



కోతికొండ గ్రామంలో దిగుబడి రాని వేరుశనగ పంట

తుగ్గలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో దాదాపు 3,798 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. మొదట్లో పంట బాగున్నా, గత నెలలో వాతావరణం అనుకూలించకపోవడంతో పంట దెబ్బతింది.



నివేదిక పంపాం

వాతావరణ మార్పులతో వేరుశనగకు ఫంగస్ తెగులు సోకి, దిగుబడి రాలేదని నివేదికలను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం నుంచి సాయం అందితే రైతులకు అందజేస్తాం. **- పవన్ కుమార్, ఏవో**

ఎకరాకు రూ.30వేల పెట్టుబడి..

వేరుశనగ సాగు చేసేందుకు రైతులు విత్తనాలకు రూ.13వేలు వెచ్చించారు. మందులు, ఎరువులు, కూలీల ఖర్చులు కలిపి ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టారు. అయితే దిగుబడి రాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదని, అప్పులు చేసి పంటలు సాగుచేశామని, ఇప్పుడు వాటిని ఎలా తీర్చాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ముంచిన ఫంగస్

మొదట్లో బాగానే ఉన్నా డిసెంబర్ నెలలో వాతా వరణ మార్పులతో వేరుశనగకు ఫంగస్ సోకింది. దీంతో కాయలు ఊరలేదు. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో రెతులు దిగాలు చెందుతున్నారు.

ఎకరాకు రూ.30వేల పెట్టుబడి



ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేశా. విత్తనాలకు రూ.13వేలు, మందులు, ఎరువులకు ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి వచ్చింది. పెట్టుబడి రాకున్నా, కనీసం విత్తనాల ఖర్చు కూడా రాలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- నారాయణ, రైతు, కోతికొండ

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌డేలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలో అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని..

1. డివిజన్ పరిధిలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు పెరిగాయని, మండలలో అవగాహనా సదస్సులు నిర్వహించాలనిఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఏరుకుల రవికుమార్ కోరారు.

3. పట్టణానికి చదువుకోడానికి వచ్చే విద్యార్థులకు పాఠశాల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ అర్జీ సమర్పించారు.

4. తనకు సర్వేనెంబర్ 464పైకిలో 2.17 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చిందని, ఇందులో 0.20 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని న్యాయం చేయాలని ఆదోని మండలం చిన్న పెండెకల్ గ్రామానికి చెందిన రంగస్వామి అర్జీ సమర్పించుకున్నారు. అలాగే కిల్చిన్ పేటలో డ్రైనేజీ నిర్మించాలని అసిఫ్, షబానా, జయమ్మ అర్జీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డీఐ ఆఫ్ సర్వే శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డీఎం మహమ్మద్ రఫి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు : ఎంఈవో



పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి అన్ని పాఠశాలల్లో పార్మేటివ్ అసెస్మెంట్-3 పరీక్షలు ప్రారంభమవుతాయని ఎంఈవో శ్రీనివాసులు సోమవారం తెలిపారు. 30వ తేదీ వరకు ఉదయం 10 గంటలకు ఒక పరీక్ష, 11:15కు మరో పరీక్ష, మధ్యాహ్నం 1.10 గంటలకు ఒక పరీక్ష, 2.20 గంటలకు మరో పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా పత్రాలను ఎంఆర్సీ భవనం నుంచి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే విద్యార్థులను పరీక్షల కోసం సన్నద్ధం చేసినట్లు తెలిపారు.

కార్యకర్తలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు

● కేంద్ర మంత్రికి ఫిర్యాదు



మంత్రికి ఫిర్యాదు చేస్తున్న నూర్ అహ్మద్

ఆదోని టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉన్నా, ఆదోనిలో టీడీపీ కార్యకర్తలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. సోమవారం కేంద్ర విమానయాన శాఖ మంత్రికి రామ్మోహన్ నాయుడుకు మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి వైసీపీ నాయకులను బీజేపీలో చేర్చుకొని వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకొని వచ్చారు. స్పందించిన మంత్రి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసినవారిలో సద్దాం హుస్సేన్, కుబేర స్వామి, శేక్షావలి, ఉన్నారు.



వెల్దుర్తి: నరసాపురంలో పశువైద్య శిబిరం

నట్టల నివారణ మందులు తాపాలి

మద్దికెర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు తమ గొర్రెలు, మేకలు, పశువులకు తప్పనిసరిగా నట్టలనివారణ మందులు తాపించాలని పశువైద్యాధికారి కృష్ణనాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బొజ్జనాయునిపేట గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. మూగజీవాలు ఆరోగ్యంగా ఉండాలంటే నట్టల నివారణ మందులు వేయించాలన్నారు. పశువులు ఎదకు వచ్చినప్పుడు పశువైద్య శాలలో మాత్రమే గర్భం ధరించే సూదులు వేయించాలన్నారు. లేగదూడలకు కూడా నట్టల నివారన మందులు తాపించాలన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామస్థులు, సిబ్బంది ఉన్నారు.

నరసాపురంలో...

వెల్దుర్తి: మండలంలోని నరసాపురం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు, కల్లూరు ఏడీ పార్థసారధి దూడలకు, పశువులకు నట్టల నివారణ మందు తాపి, ప్రథమ చికిత్స అందజేశారు. పశువైద్యులు స్వాతి, శాంతలత, ఎల్లరాజు, పుల్లయ్య, రామాంజనే యులు, లింగన్న, లక్ష్మన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

యువగళం చారిత్రాత్మకం

● ఆదోని, ఆలూరు, పత్తికొండలో కేకు కట్ చేసిన నాయకులు



పత్తికొండలో కేకు కట్‌చేస్తున్న నాయకులు



ఆలూరులో వేడుకలు..



ఆదోనిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల విజయోత్సాహం

ఆదోని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రాత్మకమని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఉమాపతి నాయుడు పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. 2023 జనవరి27న ప్రారంభమైన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పుకు నాందీ పలికిందన్నారు. 226 రోజుల్లో 3,132 కిలోమీటర్లు, 2,097 గ్రామాల్లో ప్రజలను నేరుగా కలిశారన్నారు. మొత్తం 97 నియోజకవర్గాల్లో కొనసాగగా, 90చోట్ల టీడీపీ విజయం సాధించిందని గుర్తు చేశారు.

యువగళానికి రెండేళ్లు

పత్తికొండ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ నిర్వహించిన యువగళం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. నాయకులు సాంబశివారెడ్డి, రామానాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నిరంకుశ విధానాలను ఎండగడుతూ గ్రామాల మీదుగా చేసిన పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలికారన్నారు. కడవల సుధాకర్, వెంకటపతి, దస్తగిరిరెడ్డి. తిప్పన్న, మీరాహుసేన్, సింగంశ్రీనివాసులు, శ్రీనివాసులుగౌడ్ ఉన్నారు.

నారా లోకేశ్‌తోనే అభివృద్ధి

ఆలూరు: యువగళం పాదయాత్ర రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కన్వీనర్ అశోక్, జిల్లా నాయకులు నరసప్ప, నెట్టప్ప, కొమ్ము రామాంజినేయులు, సురేంద్ర, మండల నాయకులు ముద్దురంగ, గూల్యం రామాంజినేయులు, రాము ముదవ్, గుండయ్య, గోవింద్, వీరేష్, బాలరాజు పాల్గొన్నారు.

ఉద్యోగాలు, ఉపాధి కోసం ఉద్యమించాలి

పత్తికొండ టౌన్ ,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలకై నిరుద్యోగులు ఉద్యమించాలని సీపీఐ కార్యదర్శి గిడ్డయ్య ఏఐవైఎఫ్ ఉపాధ్యక్షుడు కారుమంచి, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ సమావేశం నిరవహించారు. గత ఎన్నికలల్లో మోడీ, నాయకులు నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చాక నట్టేట ముంచాకన్నారు. ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ మహాసభలకు తరలిరావాలన్నారు రాజాసాబ్, అల్తాప్,ఉపేంద్ర, సిద్ధూ, అనుమేష్, పెద్దయ్య పాల్గొన్నారు.

కంది కొనుగోళ్లు ప్రారంభం

హాలహర్వి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కంది కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఏవో శివశంకర్ అన్నారు. క్వింటం రూ.7550ల ప్రకారం కొనుగోలు చేస్తామని, తేమ 12శాతం ఉండాలని తెలిపారు. సర్పంచ్ మల్లికార్జున, నాయకుడు ప్రహ్లాద రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

తుగ్గలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్దతు ధరతో కందులను కొనుగోలు చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. సోమవారం మండల స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లను ఏవో పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు.

ఉచిత వైద్యం ఇచ్చి ఆదుకోండి

తుగ్గలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలమ్మ అనే మహిళకు ఆరోగ్యశ్రీ కార్డు లేదని, ఉచిత వైద్యం అందేలా సిఫారసు చేయాలని టీడీపీ నాయకుడు నాగరాజు కోరారు. సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ తమ పరిధిలోనిని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ఆరోగ్యశ్రీ కార్డు లేని మహిళకు కూడా సిఫారసు లెటరు అందిస్తామన్నారు.

ఫిబ్రవరిలో టీ20 క్రికెట్

పత్తికొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తిరుణాల సందర్భంగా ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు సౌత్ ఇండియా టీ-20 క్రికెట్‌పోటీలు నిర్వహి స్తున్నట్లు కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. కేఈ మాదన్న స్మారక క్రికెట్ ట్రోఫీ పేరిట పట్టణంలోని క్రీడామైదానంలో నిర్వహిస్తామని, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పోటీలను ప్రారంబిస్తారన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా.జ్ఞానేశ్వర్ ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్ సబ్జెక్టులకు ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు 55శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు సమర్పించి, 29న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

దేవనకొండ,జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఎలక్ట్రిషయన్లు జాగ్రత్తలు పాటించాలని సీఐ వంశీనాథ్, ఏఈఈ రవీంద్ర సూచించారు. సోమవారం నేషనల్ ఎలక్ట్రిషయన్ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు.

రైతులకు తొమ్మిది గంటల విద్యుత్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● విద్యుత్ ఏఈఈ బి.రవీంద్ర



దేవనకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తుందని ఏఈఈ బి.రవీంద్ర అన్నారు.

ప్రశ్న: మండలంలో విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

జవాబు: 14,200 గృహ, 6,800 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

ప్రశ్న: వ్యవసాయానిని ఎన్ని గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు ?

జవాబు: మండలంలోని ఐదు సబ్ స్టేషన్ల నుంచి రెండు విడతలలో రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 5 వరకు, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: నూతన కనెక్షన్ కావాలంటే ఏలా?

జవాబు: గృహాలకు రూ.1,750లు, దుకాణాలకు రూ.2,750లు మీసేవలో చెల్లిస్తే నూతన కనెక్షన్ ఇస్తాం. వ్యవసాయ కనెక్షన్ కావాలంటే మీసేవలో రూ.150లు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. లైన్‌మెన్ సర్వే చేశా, అనుమతి కోసం డీఈఈ కార్యాలయానికి పంపుతాం. విద్యుత్ కనెక్షన్‌కు అయ్యే ఖర్చులో ప్రభుత్వం ఇచ్చే రూ.50 వేల సబ్సిడీ పోను మిగతా మొత్తం రైతులే చెల్లించాలి.

ప్రశ్న: సూర్యఘార్ పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

జవాబు: మండలంలో సూర్యఘార్ కోసం ఎస్సీ, ఎస్టీలు 1,900 మంది, బీసీలు 30 మంది దరఖాస్తు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కేవీ వరకు ఉచితంగా ఇస్తాం. బీసీలు, ఇతరులకు కిలో వాట్స్‌కు రూ.30వేల సబ్సిడీ, బ్యాంకు రుణం రూ.30 వేలు ఇస్తాం. మండలంలో వచ్చే నెల నుంచి పనులు మొదలుకానున్నాయి.

ప్రశ్న: ఎస్సీఎస్టీలకు ఎన్ని గృహాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారు?

జవాబు: ఎస్సీ, ఎస్టీ గృహాల కనెక్షన్లు 2,200 ఉన్నాయి. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వర్తిస్తుంది. 200 యూనిట్లు దాటితే బిల్లు చెల్లించాలి.

ప్రశ్న: మండలంలో విద్యుత్ పనులు చేస్తున్నారా?

జవాబు: ఆర్‌డీఎస్ఎస్ (రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద గ్రామాలకు గృహ విద్యుత్ పనులను చేస్తున్నాం. ఇప్పటికే 10 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఈఆర్‌డీఎస్ఎస్ ద్వారా వ్యవసాయం, గృహాల విద్యుత్‌లైను వేరు వేరుగా ఏర్పాటు చేస్తాం.

కార్ల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు

● అభివృద్ధి పనులను తనిఖీ చేసిన పీఠాధిపతి



ప్లానింగ్‌ను పీఠాధిపతికి వివరిస్తున్న మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్

మంత్రాలయం జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు కారుల పార్కింగ్ స్థలం సిద్ధం చేసినట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం రాత్రి మధ్వమార్గ్ కారిడార్ సుజయీంద్ర మార్గ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం కార్ల పార్కింగ్ కోసం ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా మైదానంలో ప్లానింగ్‌ను మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్ పీఠాధిపతికి వివరించారు. కార్యక్రమంలో రమాకాంతాచార్, ద్వారకానాథ్ ఆచార్, అనంతపురాణిక్, విజయేంద్రాచార్, నాగరాజు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నగర సంకీర్తన

భజనలతో 180 మంది మహిళలు ర్యాలీ



మధ్వమార్గ్ కారిడార్‌లో మహిళల సంకీర్తన

మంత్రాలయం జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం మైసూరు చెందిన రామలీల సంగీత మందిర్ ఆధ్వర్యంలో భరతనాట్యం చేస్తూ 180 మంది భజన మండలి మహిళలతో నగర సంకీర్తన ర్యాలీ నిర్వహించారు. సోమవారం రాత్రి రాఘవేంద్ర సర్కిల్ నుంచి సునీత చంద్రకుమార్, ప్రతిభ గురురాజ్, అమ్రేష్ కుమార్ ఆధ్వర్యంలో సంస్థ సంగీత మందిరం ఏర్పాటు చేసి ఎనిమిదేళ్ల సందర్భంగా నగర సంకీర్తన చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవాయిద్యాలు, వేద సంకీర్తనలతో మధ్వమార్గ్ కారిడార్, శ్రీమఠం ప్రాంగణం మార్మోగింది. మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి పూజలు చేసి పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. రాధిక, స్పర్శ, అంకిత, సుమిత్ర, నిఖిత, నిహారికలు చేసిన భరతనాట్యం భక్తులను అలరించింది. వీరికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాలక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కులుమాలలో దూడల ప్రదర్శన

గోనెగండ్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): దూడల కోసం వాటి యజమానులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని పశుసంవర్థన శాఖ ప్రత్యేక అధికారి భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కులుమాల గ్రామంలో రాష్ట్రపశు సంవర్ధన శాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అలాగే పశువుల ఆరోగ్యశిబిరం కూడా ఏర్పాటు చేశారు. పశుసం వర్థక శాఖ అధికారులు మాట్లాడుతూ నేటి దూడలే రేపటి పశువులన్నారు. దూడల పెంపుదలలో యాజమాన్య పద్ధతులు తప్పని సరిగా పాటించాలని కోరారు. ఆరోగ్యంగా ఉన్న దూడల యజమానులకు బహుమతులు, లివర్ టానిక్, ఐరన్‌ధాతువు కలిగిన మందులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపసంచాలకులు ప్రసన్నబాబు, జిల్లా పశుగణాంకాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు రాజశేఖర్, వైద్యులు వెంకటేశ్వర్లు, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నందవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు. అలాగే అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరై గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులు, వాటి కోసం పంపిన ప్రతిపాదనలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సందిప్, ఏవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హాజరు పట్టికలో సంతకాలు తప్పనిసరి

తహసీల్దారు శ్రీనివాసులు



మాట్లాడుతున్న తహసీల్దార్

నందవరం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హాజరు పట్టికలో సిబ్బంది సంతకాలు తప్పనిసరిగా పెట్టాలని తహసీల్దారు శ్రీనివాసులు సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం నందవరం తహసీల్దారు కార్యాలయంలో డీటీలు, ఆర్ఐ, సర్వేయర్లు, వీఆర్వోలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు వెళ్లేటప్పుడు వీఆర్వోలు, సర్వేయర్లు హాజరు పట్టికను ఏర్పాటు చేసుకుని తప్పని సరిగా సంతకాలు పెట్టి ఏ గ్రామానికి విజిట్‌కు వెళ్తున్నారో చెప్పాలన్నారు. కొంతమంది సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అలా చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో చేపట్టే రీ సర్వేకు అందరు సహకరించి విజయవంతం చేద్దాం అన్నారు. సమావేశంలో డీటీలు శశిశేఖర్‌రావు, మహేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి, మండల సర్వేయర్ అక్బర్‌బాష, ముగతి శేఖర్, మల్లికార్జునగౌడు, విఆర్వోలు ముగతి రాఘవేంద్ర, చక్రవర్తి, తిమ్మప్ప, చిన్నకొండన్న, రవికుమార్‌గౌడు, రామేశ్వరమ్మ పాల్గొన్నారు.

చంటి పిల్లలతో ఎండలోనే..

● అసౌకర్యాల మధ్య కు.ని ఆపరేషన్ల నమోదు
● ఇబ్బంది పడ్డ బాలింతలు, సహాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల నమోదు కార్యక్రమంలో బాలింతలు, సహాయకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కువమంది ఎండలోనే చంటి బిడ్డలను పెట్టుకొని కూర్చుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతి సోమవారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, గర్భనిరోధక ఆపరేషన్‌లు నమోదు చేసుకుంటారు. ఇందులో భాగంగానే సోమవారం దాదాపు 60మందికి పైగా మహిళలు, బాలింతలు ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రికి వచ్చిన వారికి సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నది. కానీ ఆసుపత్రి సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఉదయాన్నే వచ్చి పడిగాపులు కాశారు. బాలింతలు చంటి పిల్లలను ఎత్తుకొని పేరు నమోదు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం కుర్చీవడానికి కుర్చీలు, స్థలం లేక చంటి పిల్లలను ఎత్తుకొని ఎండలోనే కూర్చున్నారు. తాగడానికి నీటి సదుపాయం కూడా లేదు. బాత్‌రూములు దుర్వాసన వెదజల్లుతుం డటంతో మూత్ర విసర్జనకు వెళ్లలేక ఇబ్బంది పడ్డారు. అలాగే స్కానింగ్‌కు వచ్చే వారి పరిస్థితి ఇంకా ఇబ్బంది కరంగా ఉన్నది. జిల్లా అధికారులు కనీస సౌకర్యాలు కల్పించాలని మహిళలు కోరుతున్నారు.



చంటి పిల్లలను ఎత్తుకొని బయట ఎండకు కూర్చున్న బాలింతలు



ఓపీలను రాయించుకుంటున్న మహిళలు

సౌకర్యాలు లేవు



నేను ఉదయం 9.30 గంటలకు రెండు నెలల బిడ్డతో వచ్చాను. తాగడానికి నీరు కూడా లేదు. కనీస సౌకర్యాలు కూడా లేవు. దాదాపు మూడు గంటలైంది నా పేరు ఇంతవరకు రాలేదు. ఎదురు చూస్తున్నాను.

- సంధ్యారాణి, సోగనూరు

ఎక్కువ మంది వచ్చారు

ఈ రోజు అనుకోకుండా కు.ని ఆపరేషన్ నమోదు కోసం ఎక్కువ మంది వచ్చారు. అందులోనూ అప్పట్లో గదిని చిన్నగా నిర్మించారు. ఎక్కువ మంది కూర్చోలేక పోయారు. కొత్త బిల్డింగ్‌లో అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేస్తున్నాం.

- డాక్టర్ సుధా అయ్యంగార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పెద్దకడుబూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. సోమవారం మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ అధ్యక్షతన విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని అన్ని విషయాలలో చైతన్యవంతులైనప్పుడే సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా ఉంటారన్నారు. అలాగే రోడ్డుపై వెళ్లేటప్పుడు కనీస నియమాలు పాటించినట్లైతే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటారన్నారు. సమావేశంలో ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ మద్దిలేటి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకలోని ధావనగెరికి చెందిన ఆర్ఎస్ నరేంద్ర అనే భక్తుడు రూ.లక్ష సంపూర్ణ సేవకు విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

నిరుద్యోగ భృతి విడుదల చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పీవైఎల్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి విడుదల చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి చిన్న ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. చాలా మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదివి ఉద్యోగాలు లేక రోడ్లపై తిరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంఈవో-2 శోభారాణి

కోసిగి జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈవో-2 శోభారాణి అన్నారు. సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలంలోని ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 శోభారాణి మాట్లాడుతూ మౌంట్ కార్మెల్ పాఠశాల యజమాన్యంపై జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో వచ్చేనెల 6నుంచి నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అందరికీ విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి ప్రభుత్వ బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షించుకోవాలన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మండల సహాయ కార్యదర్శి మిథిన్, ఉపాధ్యక్షులు రాజు, కమిటీ సభ్యులు సందీప్, మహేంద్ర పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు మందకృష్ణ మాదిగ అండ



కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోసిగి జనవరి 27(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మందకృష్ణ మాదిగకు తగిన గౌరవం లభించిందని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింతకుంట సామేల్ అన్నారు. సోమవారం కోసిగిలో ఎస్సీ కమ్యూనిటీ హాలులో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, చిదానంద, ప్రకాష్, ఈరన్న, నరసయ్య, రాజు, శివ, రుద్రముని, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

కల్లుకుంటలో మురుగు

పెద్దకడుబూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుకుంట గ్రామంలో మురుగుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా గ్రామంలోని మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగు నిండుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక దోమలు విజృంభిస్తున్నాయని దాంతో అంతుచిక్కని వ్యాధులకు గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.



ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

లోకేశ్ యువగళానికి రెండేళ్లు

టీడీపీ నాయకుల సంబరాలు





మాధవరంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మిగనూరు టీడీపీ కార్యాలయంలో..

మంత్రాలయం జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆయన సోదరులు మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డిలు కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. సోమవారం మాధవరంలో తన నివాసం ముందు కేక్ కట్ చేసి, బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేశ్ పర్యటన వల్ల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాకేష్ రెడ్డి, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, గోపాల్, శాబీర్ బాషా ఖాద్రి, రాఘవేంద్ర, రామయ్య, భీమిరెడ్డి, బొజ్జప్ప, కేశన్న, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులకు కారణమైందని ఎమ్మిగనూరు మున్సిపల్ మాజీ వైఎస్ ఛైర్మన్ కొండయ్య చౌదరి, అన్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర పూర్తై రెండేళ్లు కావడంతో సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు మిఠాయి నరసింహులు, కౌన్సిలర్ రామదాసు గౌడ్, రంగస్వామి గౌడ్, రామకృష్ణనాయుడు, మచాపురం కాశీంవలి, కటారి రాజేంద్ర, నవాజ్‌తో కలిసి కేక్‌ను కొండయ్య చౌదరి కట్‌చేశారు. కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పార్లపల్లి మల్లికార్జున, ముల్లా ఖలీముల్లా, సలీం, మిన్నప్ప, వాల్మీకి రాజు, అంబేద్కర్, వాహిద్, ఈరన్న, కృష్ణ, అబ్దుల్లా, రామకృష్ణ పాల్గొన్నారు.

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై విహరించారు. సోమవారం పుష్య త్రయోదశి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణ కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో నిర్వహించారు.

గడ్డివాములు దగ్ధం

రూ.3 లక్షల నష్టం

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని హనుమాన్ నగర్ శివారులో సోమవారం రాత్రి నిప్పంటుకొని గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో దాదాపు రూ. మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించి రైతు పోలు కల్లు వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీ శివారులో రైతు వెంకటేష్ నివాసం ఉంటున్నాడు. పశువుల కోసమని గ్రాసాన్ని కొనుగోలు చేసి నిల్వ చేశాడు. అయితే సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాముకు నిప్పటించారు. దీంతో పెద్ద ఎత్తున్న మంటలు చెలరేగి పక్కన ఉన్నా మరో గడ్డి వాముకు వ్యాపించాయి. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ గంగిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. సమీపంలో గృహాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దాదాపు ఏడాది పొడవున పశువుల కోసం నిల్వ చేసుకున్న గ్రాసం కాస్త బూడిద పాలు కావడంతో రైతు ఆందోళన చెందాడు.



దగ్ధమవుతున్న గడ్డివాములు

ప్రజలు బెంబేలు

● గ్రామాల్లో గుర్రాలు, కుక్కలు, కోతుల వీరంగం
● బయటకు రావడానికి జంకుతున్న జనాలు

గోనెగండ్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గుర్రాలు, వీధి కుక్కలు, కోతులు వీరంగం సృష్టిస్తున్నాయి. దాంతో ప్రజలు బేంబేలు ఎత్తుతున్నారు. గుర్రాలు పగలంతా వీధుల్లో భయాందోళనలకు గురి చేస్తున్నాయి. రహదారికి అడ్డంగా ఉంటూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. అలాగే కుక్కలు, కోతులు కూడా గుంపులు గుంపులుగా తిరుగుతూ జనంపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. గోనెగండ్ల మండలంలో నవంబరు, డిసెంబరులో సుమారు 500 మందిపై కుక్కలు, గుర్రాలు దాడి చేసిన సంఘటన చోటు చేసుకున్నాయి. మహిళలు వంటసామగ్రిని శుభ్రం చేయడం కోసం ఆరుబయట కూర్చుంటే కోతులు దాడులుచేసి సామగ్రిని ఎత్తుకెళుతున్నాయి. ఆరుబయట తిండి పదార్థాలు ఆరబోసుకునేందుకు కూడా జంకాల్సిన పరిస్థితి దాపురించింది. పిల్లలు దుకాణాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. కేబుల్ వైర్లపై ఉయ్యాల ఊగుతూ తెంపివేస్తున్నాయి. అలాగే గుర్రాలు పగలంతా ఆయా గ్రామాల వీధుల్లో తిరుగుతూ దారికి అడ్డంగా ఉంటూ రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇక రాత్రి పూట వేరుశనగ, పత్తి, టమోటా, బెండ, చిక్కుడు, మొక్కజొన్న, పంటలపై రాత్రి గుర్రాలు దాడులు చేస్తూ నాశనం చేస్తున్నాయి. జనసంచారం అధికంగా ఉన్న సెంటర్ల దగ్గర, మటన్, చికెన్ దుకాణాల వద్ద కుక్కల హంగామా అంతా ఇంతా కాదు. అటు వైపు వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయా పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పంటను నాశనం చేస్తున్న గుర్రాలు



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు